సర్వేలో తప్పలకు ఆస్కారం ఉండొద్దు

- జిల్లా పంచాయతీ అధికారి మురళి

మునుగోడు: సమగ్ర కుటుంబ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని, తప్పులకు ఆస్కారం ఉండొద్దని జిల్లా పంచాయతీ అధికారి మురళి ఎన్యుమరేటర్లకు సూచించారు. మంగళవారం ఆయన మునుగోడు మండలంలోని గూడపూర్, జమస్తాన్‌పల్లి గ్రామాల్లో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేని పరిశీలించారు. సర్వేకు వెళ్లిన సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేకపోతే మరోమారు వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. ఇంటి యజమానిని ఇబ్బందికి గురిచేయవద్ద సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.

ఎన్యుమరేటర్లకు సహకరించాలి

నార్కట్‌పల్లి: సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని గోపలాయపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. ఫారంలో ఇచ్చిన ప్రతి అంశానికి సంబంధించిన వివరాలు నమోదు చేయాలని సూచించారు. సర్వేను పారదర్శకంగా ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ కె.ఉమేష్, ఆర్‌ఐ తరుణ్, ఎంపీఎస్‌ఓ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామంలో జరుగుతున్న కుటుంబ, ఆర్థిక, సామాజిక సర్వేను మంగళవారం నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి పరిశీలించారు.ఆయన వెంట చిట్యాల తహసీల్దార్ కృష్ణానాయక్, ఆర్‌ఐ జాని షరీఫ్, పాల్గొన్నారు.



మునుగోడు: సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ మురళి

సర్వే వేగంగా నిర్వహించాలి

చండూరు : సమగ్ర కుటుంబ సర్వే వేగంగా నిర్వహించాలని చండూరు ఆర్డీఓ శ్రీదేవి సూపర్‌వైజర్లకు సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సూపర్‌వైజర్ల ప్రత్యేక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సర్వే నిదానంగా సాగుతుందని .. సమయం సరిపోదని వేగం పెంచాలన్నారు. అవసరమైతే ఎన్యూమరేటర్లను పెంచుకోవాలని సూచించారు. సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ దశరథ, ఎంపీడీఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

చండూరు (గట్టుప్పల్) : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే చండూరు, గట్టుప్పల్ మండలాల్లో కొనసాగుతుంది. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సమాచారం సేకరిస్తున్నారు. సర్వేను తహసీల్దార్ రాములు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి షఫీ, సిబ్బంది సురేష్, ఉన్నారు

మర్రిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే మండలంలో కొనసాగుతుంది. అన్ని గ్రామాల్లో సర్వే ముమ్మరంగా జరుపుతున్నట్లు ఆయా గ్రామాల సూపర్‌వైజర్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.



చిట్యాల: సర్వే వివరాలు తెలుసుకుంటున్న నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి



చండూర్ : మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీదేవి

సర్వేకు సహకరించాలి

నాంపల్లి: సమగ్ర సర్వేకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని చండూర్ ఆర్డీఓ శ్రీదేవి అన్నారు. నాంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సూపర్‌వైజర్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమావేశంలో కో-ఆర్డీనేటర్లు మేరీ స్వర్ణలత, తహసీల్దార్ గోగులోతూ దేవసింగ్,'ఎంపీఓ ఝున్సీ, అధికారులు రామచంద్రయ్య, మల్లికార్జున్ ఉన్నారు.

క్లుప్తంగా

నేడు నల్లగొండలో విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: నల్లగొండలో 11కేవీ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తున్నందున్న బుధవారం నల్లగొండలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8:30 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ వేణుగోపాలాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రకాశంబజార్, మిర్యాలగూడ రోడ్డు, ఎస్‌ఆర్‌గార్డెన్స్, మాన్యం చెల్క, ఆర్టీసీకాలనీ, బస్టాండ్, శ్రీనివాసకాలనీ, గొల్లగూడ, పెద్దబండ, కలెక్టరేట్, ఫారెస్టు కార్యాలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నార్కట్‌పల్లి మండలంలో

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి 33కేవీ, నార్కట్‌పల్లి ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ తీగలకు తాకుతున్న కంపచెట్లను తొలగించటానికి ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నార్కట్‌పల్లి సహాయక ఇంజినీర్ కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నార్కట్‌పల్లి, బి వెల్లెంల, చెరువుగట్టు, నెమ్మాని, నక్కలపల్లి, అక్కెనపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు కల్యాణం

రామగిరి (నల్లగొండ): నల్లగొండలోని తులసీనగర్ భక్తాంజనేయ దేవాలయంలో చిలుక ద్వాదశి సందర్భంగా బుధవారం ఉదయం 11 గంటలకు శ్రీ దాత్రి నారాయణ సమేత తులసీ అమ్మ వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కఊశిక కుశలయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

చెస్ పోటీలకు ఎంపిక



అనూష

కనగల్ : మండల కేంద్రంలోని అక్కనేపల్లి వెంకటేశ్వరరావు మెమోరియల్ మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ గ్రూపునకు చెందిన అనూష రాష్ట్రస్థాయి అండర్- 19 చెస్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ థామస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనూష ఈనెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా తరఫున పాల్గొననుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు విజయ్, భద్రయ్య, జగదీష్, శ్రీనివాస్, రాజేందర్, రాజు తదితరులు అభినందించారు.

రేపు బహిరంగ వేలం

రామగిరి (నల్లగొండ): పానగల్‌లోని ఛాయ సోమేశ్వర స్వామి దేవాలయంలో కొబ్బరి కాయలు, పూజ సామగ్రి, ప్రసాదాల విక్రయాల అనుమతికి గురువారం ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రాపోలు బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

లైటింగ్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

నల్లగొండ: నల్లగొండ లైటింగ్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా మహమ్మద్ షబ్బీర్, ఉపాధ్యక్షుడిగా షేక్ హబీబ్, ప్రధాన కార్యదర్శిగా బుర్రి రవీందర్ , ఫౌండర్ అండ్ ట్రెజరర్‌గా సయ్యద్ అఖిల్, అడ్వయిజర్లుగా ఖాజా సలీం, షేక్ అబ్దుల్ రెహమాన్, మహమ్మద్ జాఫర్ అలీ, కత్తుల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా పిడతల శ్రీను, ప్రచార కార్యదర్శిగా గొట్టిముక్కుల మల్లికార్జున్‌ను ఎన్నుకున్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారి

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని మంగళవారం వెలిమినేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉబ్బు నర్సింహా తనిఖీ చేశారు. ఉపకేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. వైద్య సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు రెడపాక హేమలత, సాయివాని, ఆశ కార్యకర్త లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

అంటువ్యాధులపై జాగ్రత్తలు తప్పని సరి

మునుగోడు: ప్రతి ఒక్కరూ అంటువ్యాధులకు గురికాకుండా జాగ్రతలు తీసుకోవాలని వైఆర్‌జీ కేర్ సిబ్బంది సింగపంగ వెంకన్న సూచించారు. మంగళవారం మునుగోడు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో పలువురికి ఏయిడ్స్ నియంత్రణ సంస్థ వైఆర్‌జీ కేర్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు చేశారు. అనంతరం అంటువ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హరికృష్ణ, లింగస్వామి, ధనంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

నార్కట్‌పల్లి: హైదరాబాద్ రాజేంద్రనగర్‌కు చెందిన భారతీయ వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు మంగళవారం నార్కట్‌పల్లి మండలం అక్కినేపల్లి గ్రామంలోని రైతు వేదికలో వరిలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త ఎస్‌వీ సాయిప్రసాద్ సమగ్ర సస్యరక్షణ, తక్కువ పెట్టుబడితో సాగు, నేరుగా విత్తే విధానం, డ్రం సీడర్, పురుగులు, కీటకాలు, తెగుళ్ల యాజమాన్యం, నీటి యాజమాన్యం, భూసార పరీక్షలు, డ్రోన్ వాడకం, నూతన వంగడాలు, సేంద్రియ పద్ధతులు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేయాల్సిన పద్ధతులపై రైతులకు వివరించారు. ఎస్‌బీఐ ఫౌండేషన్, సీఎస్‌ఆర్ ఫండ్ సహకారంతో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రావణ్‌కుమార్, అదనపు సంచాలకులు జానిమియా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సాయిప్రసాద్

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన

నాంపల్లి : తేమతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి, వాసిపాక ముత్తిలింగం,కొమ్ము లక్ష్మయ్య, పల్లేటి వెంకటయ్య ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

నకిరేకల్ : పట్టణంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని నకిరేకల్ మున్సిపల్ చైర్ పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మున్సిపాలిటీలోని 13వ వార్డులో ఎమ్మెల్యే వేముల వీరేశం కేటాయించిన ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం అమె పరిశీలించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో మిగిలి ఉన్న సీసీ, డ్రెయినేజీ పనులు చేపడతామన్నారు. అభివృద్ధి విషయంలో అందరికీ సహకరించాలని కోరారు. అమె వెంట కౌన్సిలర్ సునీత రవీందర్ ఉన్నారు.

బీజేపీ బూత్ కమిటీలను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

చండూరు : భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదును ఈనెల 15వరకు పూర్తి చేసి, 16, 17 తేదీల్లో బూత్ కమిటీలు వేయాలని ఆ పార్టీ యాదాద్రి జిల్లా ఉపాధ్యక్షుడు, చండూరు పట్టణ సంస్థాగత ఎన్నికల ఇంచార్జ్ రమణగోని శంకర్ సూచించారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు పందుల సత్యం గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సింగిల్ విండో డైరెక్టర్ బోడ ఆంజనేయులు, భూతరాజు శ్రీహరి, దాసోజు భిక్షమాచారి, అన్నెపర్తి యాదగిరి, సామ వెంకట్ రెడ్డి, చెనగాని శేఖర్, కటకం నరేష్, కారింగు విజయ్, చిట్టిప్రోలు వెంకటేశం, మంచుకొండ సాగర్, గండు శ్రీకాంత్, ఇరిగి కుమార్, రామిశెట్టి, కిరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గూడపూర్ వాసికి డాక్టరేట్




డాక్టరేట్ పట్టా అందుకుంటున్న ఉషారాణి

మునుగోడు: మండలంలోని గూడపూర్ గ్రామానికి చెందిన నన్నూరి సుధాకర్‌రెడ్డి, మణెమ్మ దంపతుల కుమార్తె ఉషారాణి భౌతికశాస్త్రం నుంచి డాక్టరేట్ పట్టా అందుకుంది. ఉషారాణి హైదరబాద్‌లోని చైతన్య డీమ్డ్ టూ బి యూనివర్సిటీలో ప్రొఫెసర్ అమ్మిరెడ్డి రాజు ఆధ్వర్యంలో సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ నానోపార్టికల్స్ ఆఫ్ మెటల్ ఆక్సైడ్ అనే పేరుతో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. డాక్టరేట్ పట్టాను యూనివర్సిటీ ప్రొఫెసర్లు సామవారం అందజేసి అభినందించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రేపు 'జర్నీ' పుస్తకావిష్కరణ

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు యాత్ర నేపథ్యంలో రచించిన 'జర్నీ' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఆ పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించనున్నట్లు ఆ పుస్తక సంపాదకులు, ఉపాధ్యాయులు పెరుమాళ్ల ఆనంద్, డాక్టర్, పొట్టబత్తుల రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డితో పాటు సాహితీవేత్తలు మేడిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ సాగర్ల సత్తయ్య, డాక్టర్ ఉప్పల పద్మ, ప్రముఖ చిత్రకారులు కూరెళ్ల శ్రీనివాస్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

సీపీఎం మండల కార్యదర్శిగా మల్లయ్య



శాలిగౌరారం: సీపీఎం మండల కార్యదర్శిగా మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన చలకాని మల్లయ్య ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ మండల కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. మండలంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని మల్లయ్య విలేకరులకు తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నార్కట్‌పల్లి : పశువులకు తప్పని సరిగా గాలి కుంటు వ్యాధి టీకాలు వేయించాలని రాష్ట పశు సంవర్థక శాఖ ఏడీ డాక్టర్ నీరజ కోరారు. మంగళవారం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని నార్కట్‌పల్లి, చిన్నతుప్పలగూడెం, నక్కలపల్లి గ్రామాల్లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. గురువారం వరకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. వెంట మండల పశువైద్యాధికారిరవినాయక్, డాక్టర్ భార్గవ్ సంతోష్, వీఎల్‌ఓ యాదయ్య ఉన్నారు.

కనీస వేతనం అమలు చేయాలని ధర్నా

నల్లగొండ టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా వీఓఏలకు రూ.20 వేల వేతనం అమలు చేయాలని తెలంగాణ వీఓఏల ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రెండవ రోజు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారితకు వీవోఏలు చేస్తున్న కృషికి తగిన ఫలితాలను ప్రభుత్వ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వీఓఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుముల దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి పొడిచేడు సులోచన మాట్లాడుతూ వీఓఏలకు సంబంధం లేని ఆన్‌లైన్ పనులను చేయిస్తున్నారని, టార్గెట్‌ల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ కారణాలతో తొలగించబడిన వీఓఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా లలిత, ఎం.మంగమ్మ, కె.రేణుక, నగేష్, బాలకృష్ణ, ఆహల్యా, నాగమణి, పి.పద్మావతి, సువర్ణ, పద్మ, సుమీల, పుష్పలత, సైదులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఓఏలు

చదువుకు పేదరికం అడ్డుకాదు

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయమూర్తి దీప్తి

నార్కట్‌పల్లి: చదువుకు పేదరికం అడ్డుకాదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయమూర్తి దీప్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మికుల నిర్మూలన, పునరావాసం అనే అంశంపై బడిబయట ఉన్న పిల్లల తల్లిదండ్రులకు నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలన్నారు. బాలల హక్కులను గౌరవించాలన్నారు. తల్లులకు చదువు చాలా ముఖ్యమైనదని, లింగ సమానత్వం పాటించాలన్నారు. జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ప్రజలకు ఉచిత న్యాయ సహాయం చేస్తుందని తెలిపారు. సమావేశంలో డీఈఓ బి.భిక్షపతి, జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఆర్.రామచంద్రయ్య, ఎంఈఓ నర్సింహ, పాఠశాల జీహెచ్‌ఎం డి.రాములు, ఉపాధ్యాయులు భారతి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి దీప్తి

ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరిస్తున్న పాలకులు

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి

చిట్యాల: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వాలు ప్రైవేటీకరిస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి ఆరోపించారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ఆ పార్టీ మండల ఎనిమిదవ మహాసభల‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో గత సీఎం కేసీఆర్ అహంకారంతో ప్రజలకు దూరమయ్యారన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల, సీనియర్ నాయకుడు బొంతల చంద్రారెడ్డి, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్, అర్రూరి శ్రీను, నాయకులు పామనగుళ్ల అచ్చాలు, మెట్టు నర్సింహ, కల్లూరి కుమారస్వామి పాల్గొన్నారు.



చిట్యాల: మండల మహాసభలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

సర్వే సక్రమంగా జరిగేలా చూడాలి

నల్లగొండ టౌన్: సమగ్ర కుల గణన సర్వేను సజావుగా సాగేలా ప్రభుత్వం చూడాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేలో ఆటంకాలు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. సర్వేకు ప్రజలు సహకరించేలా ప్రభుత్వం ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని వినతి

నకిరేకల్ : ఆశ కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, అర్హులైన వారిని ఏఎన్‌ఎంలుగా నియమించాలని కోరతూ ఆశ కార్యకర్తల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండలో కలెక్టర్ త్రిపాఠీకి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు సింగం రేణుక మాట్లాడుతూ చాలీ చాలని వేతనాతో ప్రభుత్వం ఆదేశించే ప్రతి పనిలో భాగస్వాములు అవుతున్నామని తెలిపారు.ప్రతి నెలా రూ.18000 వేతనం ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వేడుకున్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్, సంఘ ప్రతినిధులు సంతోష, ప్రమీలా, భారతి, వరమ్మ, రమాదేవి, విజయలక్ష్మి, మంజుల సైదమ్మ, చంద్రకళ, పుష్పలత, యశోధ ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రేణుక

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు

నకిరేకల్ : జాప్యం లేకుండా ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని నకిరేకల్ మండల తహసీల్దార్ ఎస్‌కే.జముురుద్దీన్ సూచించారు. నకిరేకల్ మండలం నోముల, చందంపల్లి, వల్లాభాపురం, టేకులగూడెం, ఓగోడు, తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఆయా కేంద్రాలకు వచ్చిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం నిల్వలను వెంటనే ఆయా పాయింట్ల కేంద్రాలకు ఎగుమతులు చేయాలన్నారు.



ధాన్యం రాశులను పరిశీలిస్తున్న తహసీల్దార్

సెల్ టవర్ ఏర్పాటుకు అనుమతులు రద్దు చేయాలని వినతి

రామగిరి (నల్లగొండ): తిప్పర్తి మండలం పజ్జూరు గ్రామంలో జనవాసాల మధ్య సెల్ టవర్ ఏర్పాటుకు అనుమతులు రద్దు చేయాలని కోరుతూ ఆ గ్రామ మాజీ సర్పంచ్ మోయిజ్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఏఓ మోతిలాల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాగి మురళి, జంజిరాలసైదులు, మాతంగిశోభన్ బాబు, దొమ్మాటి శ్రీనివాస్, పాంపాటి గణేష్ గడగోజు సత్యనారాయణ, సింగం సైదులు, దొడ్డ సోమయ్య, పేరపాక నర్సింహ పాల్గొన్నారు.



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న పజ్జూరు గ్రామస్తులు

పార్కింగ్ ఇలా.. వాహనాలు పోయేదెలా?

- రోడ్డుపైనే ఇష్టారాజ్యంగా వాహనాల నిలుపుదల
- శాలిగౌరారంలో జఠిలమవుతున్న ట్రాఫిక్ సమస్య
- పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రజల వినతి



శాలిగౌరారంలోని ఎస్‌బీఐ ఎదుట రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

శాలిగౌరారం: మండల కేంద్రంలోని నకిరేకల్ -గురుజాల ప్రధాన డబుల్‌రోడ్డు పార్కింగ్‌కు అడ్డాగా మారింది. రోడ్డు పొడవునా ఇదే పరిస్థితి నెలకొనడంతో వాహనాలను నడపాలంటేనే వాహన చోదకులు జంకుతున్నారు. రోడ్డుపై వాహనదారులు ఇష్టారాజ్యంగా వాహనాలు నిలిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. మండలకేంద్రంలో ఉన్న డబుల్‌రోడ్డు షాపుల యజమానుల ఆక్రమణతో ప్రస్తుతం ఇరుకుగా మారింది. దుకాణాలకు వచ్చే వినయోగదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపక తప్పని పరిస్థితి.

ఎస్‌బీఐ ఎదుట..

మండలకేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే ఎస్‌బీఐ బ్యాంకు వద్ద పరిస్థితి మరింత దారుణం. బ్యాంకు ముందు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. దీనికి తోడు బ్యాంకుకు ఎదురుగా ఆన్‌లైన్ సేవలకు సంబంధించిన షాపులు ఉండటం సమస్య తీవ్రతరం అవుతోంది. ప్రస్తుతం ఒకపక్క వరి కోతలు జరుగుతుండటం, మరోపక్క కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతుండటంతో వరికోత యంత్రాలు, లారీలు, ధాన్యం ట్రాక్టర్లు రోడ్డుపై ఎక్కువగా నడుస్తుండటంతో మండల కేంద్రంలోని రోడ్డు అత్యంత రద్దీగా మారింది. రోడ్డుపై వెళ్లే వాహనాలు సాఫీగా పోయేందుకు వీలులేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించి ప్రమాదాలు జరుగకుండా నివారించాలని కోరుతున్నారు.

రోడ్డు ఆక్రమణతోనే ఇబ్బందులు



మండలకేంద్రంలో మెయిన్‌రోడ్డు వెంట బౌండరీస్థలం ఇరువైపులా ఆక్రమణకు గురైంది. కొంతమంది షాపుల యజమానులు రోడ్డుమీది వరకు మట్టిపోయడంతో డబుల్‌రోడ్డు సింగిల్‌రోడ్డుగా మారింది. మండలకేంద్రంలోని బ్యాంకులు, దుకాణాలకు వచ్చే వినియోగదారులు రోడ్డుపైనే తమ వాహనాలను నిలుపుతుండడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది.

– గోదల వెంకటరెడ్డి, శాలిగౌరారం

ప్రమాదాలను నివారించాలి



మండలకేంద్రంలో మెయిన్‌రోడ్డుపై వాహనాలను పార్కింగ్‌లు చేయడం వల్ల రోడ్డు ఇరుకుగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపై వాహనాల పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారించాలి. మండల కేంద్రంలో వాహనాల వేగనియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– పుల్లూరి దేవేందర్, శాలిగౌరారం

కేసులు నమోదు చేస్తాం



వాహనదారులు ఇష్టారాజ్యంగా రోడ్డుపై వాహనాలను నిలిపి రాకపోకలకు అంతరాయం కలిగిస్తే కేసులు నమోదు చేస్తాం. సంబంధిత షాపుల నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేస్తాం. బీటీరోడ్డు, సీసీరోడ్డు అవతలనే వాహనాలను నిలుపాలి. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనదారులు వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.

– డి.సైదులు, ఎస్‌ఐ, శాలిగౌరారం